# దిబ్బరాజ్యంలో స్వాతంత్ర్యం

**నా** అపూర్వ మిత్రులునూ, పూర్వ మిత్రులునూ అయిన దిబ్బరాజుగారిని ఒకసారి దర్శించాలని అభిలాష కలిగి దిబ్బరాజ్యం వెళ్ళాను.

దిబ్బరాజుగారు నన్నుచూసి చాలా సంతోషించారు.

"మీరు పత్రికల్లో నన్నుచూసి రాసింది విన్నాను," అన్నారు దిబ్బరాజుగారు. "చాలా రోజులుగా మీ రాకకెదురుచూస్తూ, ఏంరాశారో అడుగుదామనుకుంటున్నాను."

పారవశ్యంలో నాకేమనాలో తెలీలేదు.

దిబ్బరాజ్యానికి స్వాతంత్ర్యం వచ్చాక నేను రావటం ఇదే మొదటిసారి. తమ రాజ్యంలో ఏమేం మార్పులు జరిగాయో చూడాలని చాలా కుతూహలంగా ఉంది," అన్నాను.

"మార్పన్న మార్పా ? మీరిప్పుడు గుర్తించలేరు. భారత యూనియను ప్రాంతాలకీ దీనికీ తేడా కనిపెట్టలేరిప్పుడు! నేను శ్రీలు వొంపలేసుకున్నాను. పత్రికల్లో చూశారు కాదూ?" అన్నాడు దిబ్బరాజుగారు.

"మీరు మీ హక్కుల్ని నిశ్చింతగా ప్రజలపరం చేసెయ్యటం గురించి చరిత్రకారులు ఎంతైనా శ్లాఘిస్తారు" అన్నాను.

"అట్లా అనరాదు. ఈ రాజ్యం వాళ్ళదికాదూ? శ్రీకృష్ణుడు అర్జునుడితో చెప్పినట్లు నేను నిమిత్తమాత్రుణ్ణి. ఎప్పుడూ నా దేశంలో ప్రజలే జాస్తిగా ఉంటున్నారు," అన్నారు దిబ్బరాజుగారు.

రాజకీయంగా ఏమేం మార్పులు జరిగాయని అడిగాను.

"రాజ్యాంగమంతా మారిపోయింది. మా దర్బారు శాసనసభగా మారిపోయింది. నన్ను దానికి అధ్యక్షుడుగా ఉండమని ఏకగ్రీవంగా కోరారు. జమీందారు లందరికీ తలా ఒక శాఖా ఇచ్చేశాను."

"రాజ్యాంగం ఏర్పాటు చేశారా ఏమిటి ?"

"ఆహా ! శాసనసభే రాజ్యాంగం తయారుచేసింది. సర్వాధికారాలూ మంత్రులవే. అధ్యక్షుణ్ణికనక ప్రతిచట్టానికీ నా సంతకం పుచ్చుకుంటారు. నా సంతకం పడేవరకూ ఏ చట్టమూ అమలు జరుగరాదని ఒక క్లాజు చేర్చారు."

"ఎన్నికలతోనే శాసనసభ ఏర్పాటయిందా ఏమిటి ?"

"దానికొక చిక్కొచ్చింది. మనరాజ్యానికి సరిఅయిన జనాభా లెక్కల్లేవు. జాబితాలు తయారుచెయ్యమని ఒక సంఘాన్ని నియమించాం. వారు 3,౪౧౮ మందిని

ఎన్యూమరేటు దేసి కాకోపుగా గసుపు అయిపోవటంవల్లా జాబితాల తయారీకి మంజూరుచేసిన డబ్బు అయిపోవటంవల్లా పని ఆగిపోయింది. పది పన్నెండు రూపాయల సొమ్ముకి లెక్క కూడా తేలలేదు. ఈ సందర్భంలో ఇద్దరు ఎన్యూమరేటర్లను విచారణ కూడా చేస్తున్నాం."

"మొత్తం జనసంఖ్య ఎంత ఉండేది దివాణంలో లెక్కలు లేవా?"

"ఉన్నాయి, క్షౌరశాఖ జాబితాను బట్టి 35 వేల 959 మందీ, చాకలిశాఖనుబట్టి 35 వేల 842 మంది తేలుతున్నారు. ఏదని నమ్మటం?. . . ఈ కారణాలవల్ల మా పాత దర్బారు సభ్యులనే శాసనసభ్యులుగా భావించి రాజ్యాంగం సాగించాం."

"మీ రాజ్యంలో పార్టీ ప్రభుత్వమా ఏక పార్టీ ప్రభుత్వమా?"

"నాకైతే ప్రజాస్వామిక సూత్రాల మీద అమిత మోజున్నది. కాని రెండో పక్షం కనిపించదు. అప్పటికి మా శాసన సభలో ఇద్దరు ప్రభుత్వ విద్రోహులు తయారయినారు. రాజ్యాంగం తయారు చేసేటప్పుడు వారు అడుగడుగునా అడ్డొచ్చారు. కాని వోటింగులో వారికి బలంలేదు. ఆ కారణంచేత వారిలో ఒకడు రెండోవాడి పాత చెప్పులు తీసి సభాధ్యక్షుడిపై విసిరారు. ఇద్దరినీ ఖైదు చేశారు. ఇప్పుడు వాళ్ళు జైలులో ఉన్నారు. ఇంకా విచారణ జరగలేదు. మరి నాలుగైదు సంవత్సరాలదాకా మా న్యాయస్థానానికి వాళ్ళను విచారించే వ్యవధి ఉంది."

"కొత్త రాజ్యాంగం కింద ఏమేమి కొత్త చట్టాలు ఏర్పరిచారు?

"జమిందారీల రద్దు శాసనం చేశాం."

"ఏమిటీ! చెప్పరేం? ఇప్పుడు జమిందారీలు లేవన్న మాట దిబ్బ రాజ్యంలో".

"లేవు కాని ఒక్కటేచింత. జమిందార్లకి నష్టపరిహారం రొక్కరూపంగా యివ్వలేక పోయాం. అందుచేత జమీందారీ రద్దుబిల్లు తొంభైతొమ్మిదేళ్ళు వాయిదా వెయ్యమని నేను ప్రతిపాదించాను. కాని ప్రజాతంత్రాభిలాషులైన మా శాసనసభా సభ్యులు దానికి ఒప్పుకో లేదు. చివరకు జమిందార్ల పరిహారంకింద వారివారికింద ఉన్న భూమి వారికే ఇచ్చేసి, మిగిలినదానికింద ప్రజలు—అంటే రైతులు—నాలుగేళ్ళపాటు పొలాలు ప్రతిఫలం లేకుండా సాగుచేసేట్టు నిర్ణయించాం. నేనుకూడా రాజ్యాధిపత్యం వొదిలేసుకున్నందుకు నాకు శాసన సభవారు నష్టపరిహారంకింద ఏటా మరో లక్ష ఇప్పిస్తున్నారు."

"అంటే క్రియకు రాజ్యాంగ వ్యవస్థలో చెప్పుకోదగిన మార్పేమీ జరగలేదన్న మాట...ఆగండి: నేను విమర్శించటంలేదు. నేనలా విమర్శిస్తానా? ఇప్పుడు నేను స్వతంత్ర భారతీయుణ్ణండోయ్! ప్రభుత్వాన్ని విమర్శించటం గిమర్శించటం జాన్తానై! నేను చెప్ప వచ్చిందేమిటంటే, దీనినిబట్టి అదివరకే దిబ్బరాజ్యంలో ఆదర్శవంతమైన ప్రజాస్వామికం అమలు జరుగుతూ ఉండిందని తేటతెల్లమౌతున్నట్టు భావించటానికి ఎటువంటి అభ్యంతరమూ ఉండదని మనకు తెలుస్తోంది. ఏమంటారు?"

దిబ్బరాజుగారు విశాలంగా నవ్వి కాఫీటోస్టు తెప్పించారు.

"దిబ్బరాజ్యంలో కమ్యూనిస్టు రాక్షసులున్నారని నానోట మీదగా అనటం చాలా కష్టగానే ఉందిగాని, ఉండకుండా ఉంటారా అని నా సందేహం. వారిని గురించి ఏమి చర్య తీసుకుంటున్నారు?"

కమ్యూనిస్టునని చెప్పుకుంటున్న వాడెవడూ కనిపించడు. కాని మన రాజ్యంలో కమ్యూనిస్టులు లేరని అనటం మనకి చాలా అవమానం. అందుచేత ఒక తెలివైన శాసనం చేశాం; ఎవడైనా ప్రజాహక్కులనిగాని, వాక్స్వాతంత్ర్యమనిగాని, సాంఘిక న్యాయమనిగాని, సంఘంలో దోపిడీ జరుగుతోందనిగాని అంటే వాణ్ని వెంటనే అరెస్టు చేసేస్తాం." దిబ్బరాజుగారు వొంగి రహస్యంగా నా చెవిలో, "మీకు రాజకీయాలను గురించి తెలియనిదేమిటుంటుంది గనకా? మనం యదార్థ దృష్టితో నడుచుకుంటూ ఉంటాం. కాని ఈ కమ్యూనిస్టులుండే! ఆదర్శప్రాయమైన మంచిమాటలు చెబుతూ వుంటారు. అవన్నీ జరిగేడుస్తాయా? అందుచేత కాస్త మంచిమాటలు చెప్పిన వాణ్నల్లా అరెస్టుచేసి పారేస్తున్నాం." అన్నారు.

"కాని కమ్యూనిస్టులు సులభంగా దొరకరేమో" అన్నా.

"అమ్మా! మా పోలీసులకి దిబ్బదేశం మొత్తం మీద చీమ చిటుక్కుమన్నా తెలిసిపోతుంది. దేశంలో ఎంతమంది నరప్రాణులైతే ఉన్నారో అందరూ మా పోలీసు చిట్టాలో ఉన్నారనుకోండి. ఈ క్షణంలో ఒక బిడ్డ పుడితే మరో అయిదు నిమిషాల్లో ఆ సంగతి పోలీసు చిట్టాలో చేరిపోతుంది," అన్నారు దిబ్బరాజుగారు సగర్వంగా.

దిబ్బ పోలీసుల అకుంఠిత ప్రజ్ఞకి నా సంతోషం వెలిబుచ్చి, "రాజ్యంలో ఆర్థిక స్థితి ఎట్లా ఉంది?" అని పృచ్ఛించాను.

నా పృచ్ఛ నా పెదవి దాటకముందే రాజుగారి మొహాన మబ్బేసింది. ఆయన నిట్టూర్చి, "ఏమీ బాగాలేదు" అన్నారు.

ఇంక వివరాలడిగాను.

"నలుగురితోపాటు మనకీ ఇంత ఇన్ఫ్లేషన్ ఉంది. అదో లెక్కలోనిది కాదు. దాని విషయం తగు బందోబస్తులే చేశాం కాని—"

బందోబస్తు వివరాలడిగాను.

"వ్యాపారాదాయాల మీదా, అధిక లాభాల మీదా ఒకటి రెండు అల్పసంఖ్యాక వర్గాలను ఓడించే పన్నులు తగ్గించి అధిక సంఖ్యాక వర్గాలు చెల్లించుకునే పన్నులన్నీ రెట్టింపు చేశాం. మిగులు బడ్జెటు మటుకు మీ దయవల్ల తయారు చేసేసుకున్నాం. అంచనా ప్రకారం రెండు మూడు వేలు మిగులున్నది. కాని క్రియకు ఇంకా ఉంటుంది. ఎందుచేతనంటే చాలామంది పన్ను లివ్వరు. వాళ్ళ ఆస్తులూ వ్యాపారాలూ వేలాని కొచ్చేస్తాయి. ఈ విధంగా చాలా భాగం పొలాలూ, పరిశ్రమలూ ప్రభుత్వ పరమవుతాయి. సోషలిజం కూడా కొంత మనసులో పెట్టుకునే ఈ పని చేశామని నేను వేరే చెప్పను. పోతే, సరుకుల ఉత్పత్తి విరివిగా పెంచేటందుకుగాను కూలీల జీతాలు తగ్గించాం, లాభాల మీది పన్ను తీసేశాం కదా—"

"కంట్రోళ్ళు పెట్టకపోయారు ?"

"నయం ! కంట్రోళ్ళతోనే కొంపపోయింది. కంట్రోళ్ళు పెట్టగానే సరుకులు మాయమయాయి. దొంగవ్యాపారం పెరిగిపోయింది. ఎవరికీ కంట్రోలుధరకు వస్తువులు దొరకనప్పుడు కంట్రోళ్ళు దేనికి ? అదో నవ్వులాట పని !"

"దొంగవ్యాపారస్తుల్ని పట్టుకోకపోయారా ?"

"మన వశమా? వాళ్ళెవరో ?! ఎక్కడుంటారో ! సరుకు ఎక్కడ దాస్తారో ! వాళ్ళని బ్రహ్మదేవుడు పట్టగలడా ?"

"ఆమాట నిజమేలెండి."

"ఎంత మంది కూలీల ఇళ్ళో సోదాచేశాం ! అంటరాని వాళ్ళనికూడా అర్థరాత్రిపూట దాపలుకాసి వెతికాం !—"

"దొంగసొమ్ము మాత్రం దొరకలేదు ?"

"దొరక్కేం దొరికింది ? ఒకళ్ళ దగ్గిర గిద్దెడు బియ్యం, ఒకడి దగ్గిర అరడజను నిప్పెట్టెలూ, ఒకరి దగ్గర గజమున్నర గుడ్డా— ఈ విధంగా దొరికింది. వాళ్ళని జైళ్ళలో తోశాం. అయినా దొంగ వ్యాపారం ఆపటం మా తరం కాలేదు."

"సరే పోనివ్వండి."

"దీనికి తగ్గట్టు ఇంకో అభ్యంతరం కూడా వచ్చింది. కంట్రోళ్ళకి."

"ఏమిటది ?"

"ముడిసరుకుల ధరలు పెరిగాయనీ, లాభాలు చాలటంలేదనీ, అందుచేత కంట్రోళ్ళు ఎత్తివెయ్యకపోతే పరిశ్రమలు సాగించమన్నారు పారిశ్రామికులు. నిజమేమిటంటే ఎక్కడా ఇంత చాంతాడు ముక్కలేదు. చాంతాళ్ళపరిశ్రమ మూసేశారు. బావుల్లోంచి నీళ్ళు తోడేందుకు లేదు. ఇళ్ళలో అన్నాలు లేవు. స్నానాలులేవు. దాహానికి చచ్చారు ప్రజలు. బిందెల పరిశ్రమా, జాడీలపరిశ్రమా, బెల్లం పరిశ్రమా, చింతపండు పరిశ్రమా దిగనాసిల్లి పోయాయి. ఒక చింతపండు పారిశ్రామికుడు ఏకంగా వందచింతలు పడగొట్టి బొగ్గుపరిశ్రమ సాగించి చచ్చేలాభాలు తీశాడు. మేం చింత బొగ్గులమీద కంట్రోళ్ళు పెట్టేలోపుగా ఉన్న బొగ్గులన్నీ అమ్మేసుకున్నాడు. అందుచేత కంట్రోళ్ళు తీసేశాం."

ఎవరన్నా లాభాలు తక్కువగా ఉంటే ఎక్కువ సరుకమ్ముకోటానికి చూస్తారు. దిబ్బ పారిశ్రామికులు ఇట్లా ఎందుకు చేస్తున్నారో నా కర్థం కాలేదు. దానికి ప్రభువుగారే సమాధానం చెప్పారు.

"మీరు చెప్పే ఆర్థిక సూత్రం చిన్న వ్యాపారస్తునికి వర్తిస్తుంది. పెద్ద పరిశ్రమలకి వర్తించదు. అది కాక మన పారిశ్రామికులు దేశభక్తులు. అందుచేత అట్లా చేశారు !"

"అయితే ప్రస్తుత పరిస్థితి బాగానే ఉందన్నమాట ?" అన్నాను.

"అనే లేదు. ఇంతా శ్రమపడి పారిశ్రామికుల కింత ప్రోత్సాహమూ ఇ కంట్రోళ్ళు తీసేస్తే ఉత్పత్తేమో పెరిగింది గాని సరుకు అమ్ముడుపోక నిలబడిపోయింది. ఛీ! ప్రజలుండే వొట్టి మూర్ఖులు. వాళ్ళ క్షేమం కోరి ఏది చెయ్యండీ, రాణించదు. సరుకు లేనప్పుడు లేవో అని గోలపెట్టారు. చూపిస్తేకొనరట. పారిశ్రామికులంతా వొచ్చి మా ఆర్థి మంత్రిమీద పడి, పాపం, లబ్బున ఏడిచారు. తమ సరుకులు ప్రభుత్వమన్నా కొనకపో ఎట్లాగన్నారు. మా ఆర్థిక మంత్రి కార్యదర్శులునూ సలహాదార్లనూ పిలిచి అడిగాడు, ఈ పరిస్థితికి కారణమేమిటని, ఒకాయన తగుదునమ్మా అని చెబుతాడు గదా; వస్తువులూ వాటి కొనవలసిన డబ్బూ ఒకళ్ళ దగ్గిరే ఉండిపోయిందట. కమ్యూనిస్టనే అనుమానం మీద ఆతగాణ్ణి వెంటనే మా ఆర్థికమంత్రి అరెస్టు చేశాడు. ఈ పుకారు ప్రజల్లో పడితే ఇంకేమన్నా ఉందా?"

"తరవాత ఏంచేశారు ?"

"ఏమీ చెయ్యనక్కర్లేదని మరో సలహాదారు శాస్త్ర గ్రంథ ప్రమాణం చూపించాడు. ఆయనెవరో రాశారట, మంచి తెలివైనవాడుగా కనిపిస్తాడు. పారిశ్రామికోత్పత్తిలో అప్పు డప్పుడూ అధికోత్పత్తి పరిస్థితులు ఏర్పడి ఆర్థిక కాటకం వచ్చేస్తుందట. దానికి ప్రతిక్రియ కూడ ఆయనే చెప్పేశాడు. అటువంటి పరిస్థితి ఏర్పడ్డప్పుడు ఉత్పత్తి అయిన సరుకు నాశనం చెయ్యాలట, ఇంకేం? సరుకులు నాశనం చెయ్యటానికి ఒక ఉపసంఘాన్ని నియమించి వెయ్యిరూపాయలు మంజూరు చేశాం. ఆ పని సక్రమంగానే జరిగిపోయింది. చాలా మంచిపని చేశాం. ఇంకానయం. ఆ సరుకంతా ఖజాన డబ్బుపెట్టి కొన్నాం కాదు. లక్షరూపాయలు వృధా అయి ఉండును. ఇప్పుడు వెయ్యిరూపాయలతో పోయింది. అయితే నాశనమయిన సరుకుకు పరిహారం ఇప్పించమంటున్నారు పారిశ్రామికులు. పరిహారమేమో ఇచ్చేదే! అయితే ఎంత అనేదాని దగ్గిర పేచీగా ఉంది !"

"పాపం తమకు చాలాగడ్డు సమస్యలే వచ్చిపడ్డాయి" అన్నాను.

"గడ్డా, గడ్డున్నరా? అందుకనే ఒక ఫర్మానా తయారుచేశాను, వింటారా ?" అన్నారు ప్రభువుగారు.

"అంతకంటేనా ?" అన్నాను.

డిబ్బప్రభువుగారు కొద్ది సంగీత ధోరణిలో ఈ క్రింది ఫర్మానా చదివి వినిపించారు.

"డిబ్బ పౌరులకు ప్రజాధ్యక్షుడు చేయు ప్రకటన : యుద్ధానంతరము ప్రజలలో ఐక్య భావము నశించి హేయమైన సంకుచిత భావములు రేకెత్తినట్టు నాకు తోచుచున్నది. ఇప్పటి ప్రభుత్వము తమదేనని ప్రజలు మరువరాదు. వారు పారిశ్రామికులు మొదలైన అల్పసంఖ్యాక వర్గములవారితో సహకరించి దేశమున ఉత్పత్తిపెరిగి దేశమునకు బలముచేకూరు నట్లు చేయవలెను. వారు ప్రతిక్షణమున్నూ ప్రభుత్వమును బలపర్చవలెను. వారు ఇంకనూ త్యాగములు చేసినగాని దేశమునకు బలము చేకూరదు, తమ తిండీ, గుడ్డా, ఇల్లూ, వాకిలీ,

చదువూ, ఉద్యోగమూ—వీని కొరకే తాపత్రయపడు ప్రజలు స్వాతంత్ర్యార్థులు కాజాలరు. దేశములోని ప్రజలందరును స్వార్థత్యాగము, ప్రాణత్యాగము జేయసమకట్టు వరకును దేశమునకు బలము చేకూరదు. కనీసము పది సంవత్సరములపాటు ప్రజలు అన్నవస్త్రములను రాజకీయ పౌరహక్కులను అడుగకుండ త్యాగము చేసినచో ఆ పైన దేశము ఎట్టి సమస్యల నైనను ఎదుర్కొన జాలియుండును. ప్రజలు సంకుచిత బుద్ధినీ, ధనిక వర్గమును చూచి ఓర్వలేని తనమును విడనాడి దేశక్షేమము కొరకు బలియగుదుదుగాక!"

ముద్రణ : 1959, దిబ్బరాజ్యం కథల సంపుటిలో నుంచీ,
జయా పబ్లికేషన్స్, విజయవాడ.